క్లుప్తంగా

దమ్మాలపాడులో ఆధార్ సేవలు



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): దమ్మాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి సేవలందించారు. చేర్పులు, మార్పులు, ఫోన్ నంబర్ అనుసంధానం, చిన్నారుల కార్డుల అప్‌డేట్ చేశారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ఆర్.నాగేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మిరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అమృతాహారం



గర్భిణులకు అమృతాహారం పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

అచ్చంపేట: నారాయణ సేవలో భాగంగా సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం 120 మంది గర్భిణులకు అమృతాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ తిమ్మిశెట్టి రాంబాబు మాట్లాడుతూ తమ సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతినెలా 9వ తేదీన మండలంలో గర్భిణులందరికీ అమృతాహారాన్ని పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మామిళ్లపల్లి విజయలక్ష్మి, జిల్లా కో-ఆర్డినేటర్ సూదా వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్యామల, డాక్టర్ రాజేష్, సమితి సభ్యులు అనిల్ కుమార్, గార్లపాటి సాంబశివరావు, పొట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి తహసీల్దార్‌గా మేరి కనకం

దాచేపల్లి : తహసీల్దార్‌గా డి.మేరికనకంను ఉన్నతాధికారులు నియమించారు. గురజాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మేరి కనకంను దాచేపల్లి తహసీల్దార్(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మేరి కనకం బాధ్యతలు స్వీకరించనున్నారు. గురజాల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మీసాల దానియేలు ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేశారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం



దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి వారధి ఫౌండేషన్ గురువారం ఆర్థికసాయం అందజేసింది. కేసానుపల్లికి చెందిన పొట్టిశెరి వెంకటేశ్వర్లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వారధి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తగరం ఆనంద్‌కుమార్ వెంకటేశ్వర్లుకు వైద్యం నిమిత్తం ఫౌండేషన్ తరపున రూ.15వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షరీఫ్, యూటీఎఫ్ నాయకులు వట్టిపు నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, సుదర్శన్, కొలా నవజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

దాచేపల్లి : రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని ఎంపీపీ కటకం జయశ్రీ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం గురువారం జరిగింది. ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు సమర్థంగా పనిచేయాలని, రేషన్ సరుకులను కార్డుదారులకు సక్రమంగా అందించాలని పేర్కొన్నారు. రేషన్ బియ్యం కార్డుదారులకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా అధికారులను కోరతామని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో గురువారం జరిగింది. పట్టణంలోని ఖలీల్ దాబా వైపు ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. అతని వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎత్తు 5.7, రంగు చామన చాయ, గచ్చకాయ రంగు షర్టు, షార్ట్ ధరించి ఉన్నాడని, అతని ఆచూకీ తెలిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ప్రతి కుటుంబానికీ ఆర్థిక చేయూత
- 3వ సచివాలయంలో మూడేళ్లలో రూ.7.52 కోట్ల లబ్ధి
- 1,432 కుటుంబాల్లో 3,391 మందికి ప్రయోజనం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి 27వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



27వ వార్డులో మహిళలకు సంక్షేమ లబ్ధి గురించి వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మూడో సచివాలయం పరిధిలోని 27వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తూ ముద్రించిన కరపత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల గుండెల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. గత టీడీపీ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, జన్మభూమి కమిటీల ముసుగులో ఆ పార్టీ నాయకులే ప్రయోజనం పొందారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలో రూ.7.52 కోట్ల మేర సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాయని అంబటి వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.6.85 కోట్ల ప్రయోజనం చేకూరగా, అభివృద్ధి పనులకు రూ.67.78 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

రూ.67.78 లక్షలతో అభివృద్ధి పనులు

14వ ఆర్థిక సంవత్సరం నిధులతో సీసీరోడ్లకు రూ.7.40 లక్షలు, 15వ ఆర్థిక సంవత్సరం నిధులతో సీసీ రోడ్లకు రూ.7.13 లక్షలు, 15వ ఆర్థిక సంవత్సరం నిధులతో సీసీ డ్రెయిన్లకు రూ.11.95 లక్షలు, సాధారణ నిధుల నుంచి సీసీ డ్రెయిన్లకు రూ.36.50 లక్షలు, సాధారణ నిధుల నుంచి సీసీ రోడ్లకు రూ. 4.8 లక్షలు ఖర్చుచేశామని మంత్రి వివరించారు. అనంతరం పలు సమస్యలను మంత్రి అక్కడికక్కడే పరిష్కరించారు. 27వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ నేతృత్వంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అట్టహాసంగా సాగింది. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరావు నాయక్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ, యువజన నాయకులు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, కోఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి(సహరా), షేక్ నాగుర్ బాషా పాల్గొన్నారు.

ప్రధాన సంక్షేమ పథకాల ద్వారా సాయం ఇలా..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	ప్రయోజనం రూపాయల్లో
రైతుభరోసా	112	48.6 లక్షలు
అమ్మఒడి	427	1.35 కోట్లు
వైఎస్సార్ చేయూత	311	11.55 లక్షలు
జగనన్న తోడు	81	16.1 లక్షలు
వైఎస్సార్ ఆసరా	716	1.32 కోట్లు
డ్వాక్రా సున్నా వడ్డీ	680	1.43 కోట్లు
కాపు నేస్తం	5	1.50 లక్షలు
వాహన మిత్ర	21	3.6 లక్షలు
విద్యాదీవెన	72	27.80 లక్షలు
వసతి దీవెన	72	13.90 లక్షలు
పెన్షన్ కానుక	490	1.4 కోట్లు
ఈబీసీనేస్తం	5	1.35 లక్షలు
జగనన్న చేదోడు	30	6 లక్షలు
ఆరోగ్య ఆసరా	22	1.20 లక్షలు
ఆరోగ్య శ్రీ	74	1.59 లక్షలు
వైఎస్సార్ బీమా	6	6 లక్షలు
రైతు సున్నా వడ్డీ	12	1.25 లక్షలు

గడప గడపకు నంబూరు @125



గడప గడప కార్యక్రమం 125 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

- పెదకూరపాడు నియోజకవర్గంలోని 51 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం పూర్తి
- అంబరాన్నంటిన సంబరాలు
- భారీ కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెదకూరపాడు నియోజకవర్గంలో పండగలా సాగుతోంది. నియోజకవర్గంలో ఇప్పటికే 51 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు జరిగాయి. 125వ రోజు క్రోసూరు రెండో సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాణసంచా మిరుమిట్ల మధ్య స్థానికులు పూలు చల్లుతూ ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 125 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అత్యంత చురుగ్గా సాగుతున్నట్టు చెప్పారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ఆత్మీయంగా ఆప్యాయంగా ఆహ్వానం పలుకుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రెండు మూడు నెలల్లో మిగిలిన సచివాయాల పరిధిలో కూడా గడప గడపకు వెళ్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లా చందమామ, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా, షేక్ గఫూర్, షేక్ కార్పొరేషన్ డైరక్టర్ షేక్ మస్తాన్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుములకోటిరెడ్డి, జూనియర్ వెంకట్రావు, షేక్ ఖాదర్, పాశంశ్రీనివాసరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ డాక్టర్ షరీఫ్, మాజీ యార్డు డైరక్టర్ అంబటినారాయణ,దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గార్లపాటిదాసు,మండల కన్వీనర్ వెలది అప్పారావు, మేదరరోశయ్య, షేక్ షుకుర్, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శి శరత్‌కుమార్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కొనియాడారు. జగనన్న చేదోడు పథకం ద్వారా ప్రభుత్వం నుంచి సాయం అందుకున్న దర్జీలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి గురువారం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తమ కష్టాలు వినేందుకు, తీర్చేందుకు జగనన్న ఉన్నారని, ఆయనకు తామంతా రుణపడి ఉంటామని దర్జీలు చెప్పారు.

సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టిపెట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ చిత్రంలో సీఐ ఉమేష్, ఎస్ఐ సురేష్ తదితరులు

నకరికల్లు: సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై సిబ్బంది దృష్టిసారించాలని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ సూచించారు. సాంఘిక దురాచారాలు - నిర్మూలన అనే అంశంపై నకరికల్లులో వలంటీర్లకు, మహిళా పోలీసులకు గురువారం వారు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. వ్యభిచారం, పేకాట, కోడిపందేలు, గంజాయి, చిట్టీలు, ఐపీ పెట్టేవారి గురించి సమాచారం సేకరించి పోలీసులకు ఇవ్వాలని సూచించారు. బాల్యవివాహాలు, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలను పసిగట్టాలని చెప్పారు. ఏదైనా విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్ఐ దృష్టికి తీసుకురావాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ బి.ఉమేష్, ఎస్ఐ పి.సురేష్, ఏఎస్ఐలు కోటేశ్వరరావు, ప్రసాద్, జిలాని, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్, ఏఓ దేవదాసు తదితరులు



మాదలలో వరిపంట నమోదు చేస్తున్న మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ

నకరికల్లు: రబీ సీజన్‌కు సంబంధించి రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి, బాలాజీనగర్ తండాలలో ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను తహసీల్దార్ ఎస్.సురేష్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు అనంతరం ఈ-కేవైసీ చేసుకోవాలని సూచించారు. మండలంలో 5,626 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నట్లు తెలిపారు. పీఎం కిసాన్‌కు సంబంధించి మండలంలోని 2,401 మంది రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఎన్‌పీసీఐ 203 మంది, ఆధార్ సంబంధించి 41 మంది రైతులు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ లోగా గ్రామ వ్యవసాయ సహాయకులకు వివరాలు అందజేసి నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రభాస్, గ్రామ వ్యవసాయ సహాయకులు జాన్‌అహ్మద్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదల(ముప్పాళ్ళ): రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. వరి, మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేశారని, ఇంకా 1598 మంది రైతులు పంట నమోదు చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. పంట నమోదు చేయించుకోకుంటే ఈనెల 25న ప్రభుత్వం అందించే ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం ద్వారా అందించే 3వ విడత సాయం రూ.2వేలు జమ కాదని వివరించారు. సాగు చేసిన పంట ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా, నష్టపరిహారం పొందాలన్నా తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి చేతిరాత పోటీల్లో విజేతలకు బహుమతులు

క్రోసూరు: స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు గత నెలలో రాష్ట్రస్థాయిలో వేద అకాడమీ ఆఫ్ హ్యాండ్ రైటింగ్ సంస్థ నిర్వహించిన చేతిరాత పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఆ విద్యార్థులకు బహుమతులు, కన్సొలేషన్ బహుమతులను గురువారం పాఠశాలలో అందజేశారు. ముఖ్యఅతిథులుగా సెయింట్ ఆన్స్ ఇంగ్లిషుమీడియం పాఠశాలల మేనేజర్ మదర్ అంతోనమ్మ, అసిస్టెంట్ మదర్ ఆంటోనీ మేరీ పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో జూనియర్ విభాగంలో రెండో బహుమతి పొందిన పి.అమృత, సీనియర్ విభాగంలో మూడో బహుమతి పొందిన ఏ.సువర్షిణికి నగదు, ప్రశంసాపత్రాలను అందించారు. ఎనిమిది మంది విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శనను తిలకించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మేరీ రజిత పాల్గొన్నారు.

దొడ్లేరు బీసీ హాస్టల్లో ప్రత్యేక అధికారి బస



బీసీ హాస్టల్‌లో భోజనం చేస్తున్న మండల ప్రత్యేక అధికారి మోహన్‌బాబు

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలోని బీసీ హాస్టల్‌లో మండల ప్రత్యేక అధికారి జి.మోహన్ బాబు గురువారం బస చేశారు. హాస్టల్లో 56 మంది విద్యార్థులు ఉంటున్నారు. వారితో ప్రత్యేక అధికారి మాట్లాడారు. అనంతరం భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చిక్కీలు, అరటి పండ్లు అందిస్తున్నారా అని ప్రశ్నించారు. విద్యార్థులు మాట్లాడుతూ తమకు భోజనాలు సక్రమంగా అందిస్తున్నారని, పోర్టిఫైడ్ బియ్యం ఇస్తున్నా అన్నం చిమిడి పోతోందని వివరించారు. దీనికి ప్రత్యేక అధికారి స్పందిస్తూ కొద్ది రోజుల్లో మంచి బియ్యం వస్తాయని వివరించారు. శుక్రవారం ఉదయం పంచాయతీలో పాదయాత్ర చేసి పారిశుద్ధ్యం పనులు పరిశీలిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రత్తయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో హిమోగ్లోబిన్ పరీక్షలు



సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నంది గామ సబ్ సెంటర్ సిబ్బంది రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం విద్యార్థినులకు హిమోగ్లోబిన్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 280 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ మాత్రలు, ఇతర మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు గణేష్, కౌసల్య, ఆరోగ్య సిబ్బంది షరీఫ్, విజయారాణి, మల్లేశ్వరి, ఆశా కార్యకర్తలు కోటేశ్వరమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఫర్నిచర్ బహూకరణ



సత్తెనపల్లి: స్థానిక ఏరియా వైద్యశాలలో నేత్ర శస్త్రచికిత్సల నిమిత్తం పరికరాలు భద్రపరిచేందుకు అవసరమైన ఫర్నిచర్‌ను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ గురువారం అందించారు. వైద్యశాలలో నేత్ర శస్త్రచికిత్సల కోసం సుమారు రూ.10 లక్షలు విలువ చేసే పరికరాలను పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్ ఇటీవల అందించారు. ఆ పరికరాలను భద్రపరిచేందుకు అవసరమైన ఫర్నిచర్ లేకపోవడంతో స్పందించిన కొత్త రామకృష్ణ ఫర్నిచర్ చేయించి అందించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఈటి పోగు వెంకట్రావు రామకృష్ణను అభినందించారు. నేత్ర వైద్యురాలు తనూజ పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

గురజాల : ప్రజలు సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు సూచించారు. పులిపాడు గ్రామంలో గురువారం సాయంత్రం ఏపీ సాక్స్, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బహుజన రాజ్యాధికార యాత్ర



అంబేద్కర్ విగ్రహానికి నివాళ్ళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

సత్తెనపల్లి:బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుజన రాజ్యాధికార యాత్ర 15వ రోజు సభ పట్టణంలోని తాలూకా సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిర్వహించారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొక్కా పరం జ్యోతి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు 100 సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు దాసరి బాలయ్య, బీఎస్పీ పల్నాడు జిల్లా ఇన్‌చార్జి నెరేళ్ల రాజు, సత్తెనపల్లి నియోజకవర్గ కన్వీనర్ పేరిపోగు నవీన్ బాబు, అధ్యక్షురాలు గుజ్జర్లపూడి కస్తూరి, కో-కన్వీనర్ బొక్క సంగీతరావు, పట్టణ అధ్యక్షుడు గుజ్జర్లపూడి నాగరాజు, సీనియర్ నేతలు బందారు రవి, గరికపాటి బెన్ని, కె.దేవానంద్ కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం



గుండ్లపల్లిలో రేషన్ వాహనంలో సరుకులను తనిఖీచేస్తున్న తహసీల్దార్ సురేష్

నకరికల్లు: స్పందన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు. గుండ్లపల్లి గ్రామంలో గురువారం పర్యటించిన ఆయన పలు సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుండ్లపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీ, అంబేడ్కర్ కాలనీకి చెందిన విద్యార్థులు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి రాగా గ్రామ రెవెన్యూ, సర్వే అధికారులతో సర్వే చేయించి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. కొత్తపల్లి యలమంద తన భూమికి సంబంధించిన సమస్య పరిష్కారానికి స్పందనలో అర్జీ పెట్టుకోగా సదరు భూమిని పరిశీలించినట్లు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ శ్మశానానికి వెళ్లేందుకు గల దారి ఆక్రమణకు గురైందని స్పందనలో దరఖాస్తు మేరకు క్షేత్రస్థాయిలో మ్యాప్ ఆధారంగా విచారణ చేపట్టామన్నారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసానిచ్చామని చెప్పారు. అనంతరం గ్రామంలో రేషన్ సరఫరా చేస్తున్న వాహనాన్ని సురేష్ తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్, సర్వేయర్ ఎస్.చంద్రబాబు, కార్యదర్శి జాన్‌పీరా, ప్రధానోపాధ్యాయుడు జాన్‌పీరా, గ్రామ సర్వేయర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత, గిరిజన మహిళల అభివృద్ధితోనే సాధికారత

సత్తెనపల్లి: దళిత, గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించిననాడే స్త్రీ సాధికారత సాధ్యమవుతుందని సత్తెనపల్లి మండల అసిస్టెంట్ ప్రోగ్రామ్ మేనేజర్ శిఖా కృపావేణి చెప్పారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో దళిత, ఆదివాసీ మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు ధూళిపాళ్లలోని మండల వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సదస్సుకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఉమ్మడి గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. కృపావేణి మాట్లాడుతూ దళిత గిరిజన మహిళా సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ముఖ్యోద్దేశంతో ఉన్నతి పథకం ద్వారా ఇచ్చిన రుణాల ద్వారా యూనిట్లు ఏర్పాటు చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు భవనం శివమ్మ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి, చేదోడు, చేయూత,అమ్మఒడి, గృహ నిర్మాణం, సంక్షేమం, అభివృద్ధి, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ రోజారాణి, బుల్లిబాబు, దానియేలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షునిగా రవీంద్రనాథ్ ఠాగూర్



అవ్వారు రవీంద్ర నాథ్ ఠాగూర్



నంభుల విష్ణుమూర్తి

సత్తెనపల్లి:యూటీఎఫ్ సత్తెనపల్లి మండల శాఖ అధ్యక్షునిగా అవ్వారు రవీంద్రనాథ్ ఠాగూర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల మహాసభలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నంభుల విష్ణుమూర్తి, గౌరవ అధ్యక్షునిగా పొన్నం వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులుగా బీవీ శేషిరెడ్డి, మహిళా సహధ్యక్షురాలిగా సామి వాసవీ కన్యక, ట్రెజరర్‌గా సయ్యద్ తాజుద్దీన్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు ఎస్.కుమార్ రాజా, ఎన్నికల నిర్వాహకులుగా జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు డి.కిషోర్ కుమార్‌లు వ్యవహరించారు. సమావేశంలో ఉపాధ్యాయులు నరసింహారావు, పాషా, బొర్రా వెంకట్రావు, శేషగిరి, అహ్మద్ బాషా, గౌస్, భద్రయ్య, శ్రీనివాసరెడ్డి, పుప్పాల, రియాజుద్దీన్, ముసులురి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

ముప్పాళ్ళ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదల నెత్తిన భారాలు మోపి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేదిగా ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ విమర్శించారు. అఖిల భారత కిసాన్ సభ, వ్యవసాయ కార్మిక సంఘం బడ్జెట్‌కు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త నిరసనలో భాగంగా గురువారం తహసీల్దార్ కార్యాలయాల వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తౌరటి అమరలింగేశ్వరరావు, నరసింహారావు, ప్రసాదు, ఏడుకొండలు, శ్రీను, జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.